

బడి బస్సులు భద్రమేనా?

బడి గంటలు మోగాయి. ఎప్పట్లానే ఫిట్‌నెస్ లేని బస్సులు మళ్లీ రోడ్డెక్కుతున్నాయి. విద్యార్థుల నుంచి ముందుగానే బస్సు ఫీజులను వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు... వారి బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడంలో మాత్రం నిర్లక్ష్య వైఖరిని కనబరుస్తున్నాయి. బస్సు సౌకర్యం కలదు అంటూ ప్రచారం చేసుకుంటున్న విద్యాసంస్థలు, వారి బస్సుల ఫిట్‌నెస్‌పై మాత్రం దృష్టిసారించడం లేదు. కండీషన్‌పై శ్రద్ధ చూపకుండా బస్సులను నడిపిస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి.



- **విద్యాసంస్థల మొత్తం బస్సులు 600**
- **ఫిట్‌నెస్ కోసం ముందుకొచ్చినవి 460**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పలు ఇంజినీరింగ్ కళాశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు వారి విద్యార్థుల కోసం బస్సులు నడుపుతున్నాయి. జిల్లాలో విద్యార్థుల కోసం బస్సులు నడుపుతున్న విద్యాసంస్థల బస్సులు సుమారు 600 వరకు ఉన్నాయి. వీటిలో 460 బస్సులు ఫిట్‌నెస్ కోసం యాజమాన్యాలు దరఖాస్తు చేసుకున్నాయి. రెండేళ్ల లోపు కొనుగోలు చేసిన బస్సులకు వచ్చే ఏడాదికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మూడేళ్ల కాలం పూర్తి చేసుకున్న ప్రతి బస్ ఫిట్‌నెస్ కోసం తప్పనిసరిగా రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. పాఠశాలలు ఈనెల 12వ తేదీ నుంచి తెరుకున్న నేపథ్యంలో ఈనెల ఒకటో తేదీ నుంచే బస్సులను రవాణాశాఖ కార్యాలయానికి ఫిట్‌నెస్ పరీక్షల కోసం తీసుకురావాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా 460 బస్సులను మాత్రమే తీసుకొచ్చారు. పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రవాణాశాఖ అధికారులు ఈ దరఖాస్తులను బట్టి ఒక్కో తేదీలో కొన్ని స్కూళ్ల నుంచి బస్సులను తనిఖీ కోసం తీసుకురావాలని చెప్తారు. వాటికి సంబంధిత అధికారులు ఫిట్‌నెస్ పరీక్షల అనంతరం రోడ్డుపై ప్రయాణించేందుకు అనుమతిస్తారు. అలా అనుమతి పొందిన బస్సులు వారం రోజుల్లో 186 వరకు ఉన్నాయి. మిగిలిన వాటిలో కొన్నింటిని ఇప్పటికే పరీక్షలు పూర్తి చేసినా ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంది. కాలం చెల్లినవిగా గుర్తిస్తే వాటికి అనుమతించరు. వాటి పర్మిట్‌ను రద్దు చేస్తారు. రవాణాశాఖ కళ్లు కప్పి అడ్డదారుల్లో స్కూల్ బస్సులను కొన్ని యాజమాన్యాలు నడుపుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రయివేటు పాఠశాలల్లో ఈరకమైన సమస్య ఉందని రవాణా శాఖ అధికారులే చెప్తున్నారు. అటువంటి బస్సులు పట్టుబడితే సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు, భారీగా అపరాధరుసుము విధిస్తామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పలు విద్యాసంస్థలు నడుపుతున్న బస్సులపై రవాణాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పుడైనా, ఏదేని ప్రాంతంలో బడి బస్సులు ప్రమాదానికి గురైతే తప్ప రంగంలోకి దిగడం లేదన్న ఆరోపణలూ లేకపోలేదు.

నిబంధనలను గాలికొదిలేస్తున్న వైనం

విద్య ప్రయివేటీకరణ నేపథ్యంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చేస్తున్నాయి. విద్యార్థులను ఆకర్షించేందుకు బస్సు సౌకర్యం అంశాన్ని పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్నాయి. బస్సులు నడపడంలోనూ విపరీతంగా పోటీ పడుతున్నాయి. బస్సులు నడుపుతున్న విద్యాసంస్థలు, విద్యార్థుల భద్రత అంశాన్ని మాత్రం గాలికొదిలేస్తున్నాయి. తక్కువ జీతానికి వస్తున్నారని అనుభవం లేని డ్రైవర్లను నియమిస్తున్నారు. కొన్నిసార్లు అనుభవం ఉన్నా వ్యసనాలున్న వ్యక్తులను డ్రైవర్లుగా నియమించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. బస్సుల్లో కనీసం ప్రథమ చికిత్స పెట్టెలనూ ఏర్పాటు చేయడం లేదు. పాఠశాల బస్సుల నమూనాను చాలా యాజమాన్యాలు అనుసరించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఇలా రోడ్డెక్కి బస్సులు తిరుగుతున్నా, ఆర్‌టిఎ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బడి బస్సుల భద్రతపై దృష్టిసారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్

విద్యాసంస్థల బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఫిట్‌నెస్ చేయించని బస్సులు రోడ్డెక్కితే సీజ్ చేస్తాం. అటువంటి బస్సులను నడిపే డ్రైవర్ల లైసెన్స్‌ను రద్దు చేస్తాం. విద్యాసంస్థల బస్సులపై ప్రత్యేక దృష్టిసారించాం. పోలీస్‌శాఖ సహకారంతో బృందాలుగా ఏర్పడి బస్సులను తనిఖీ చేస్తాం.

- శివరాం ప్రసాద్,
డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్

స్కూల్ బస్సు బోల్తా

- **డ్రైవర్, క్లీనర్‌తో పాటు ఇద్దరికి తీవ్ర గాయాలు**
- **నలుగురు చిన్నారులకు స్వల్ప గాయాలు**

ప్రజాశక్తి - సరుబుజ్జిలి / ఆమదాలవలస

విద్యార్థులతో ప్రయాణిస్తున్న మండలంలోని రొట్టవలసలో గల కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన బస్సు బుధవారం బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు కాగా, నలుగురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం... కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సు 12 మంది విద్యార్థులతో పురుషోత్తపురం నుంచి రొట్టవలస వెళ్తోంది. వేగంగా వెళ్తున్న బస్సు పురుషోత్తపురం గ్రామ శివారులోని మందలమ్మ పేరంటాల గుడి మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన పొలాల్లో బోల్తా పడింది. ఉదయం 8.45 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ ఎస్.సింహాచలం, క్లీనర్ ఎల్.అప్పారావు తలకు గాయాలయ్యాయి. అదే బస్సులో రొట్టవలస కూడలికి వెళ్తున్న పురుషోత్తపురానికి చెందిన బి.కృష్ణ, అడ్మిషన్ కోసం వెళ్తున్న ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో చిన్నారుల రోదనలు మిన్నంటాయి. స్థానికులు, విషయాన్ని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై గాయపడిన విద్యార్థులను ఆమదాలవలసలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. తలకు బలమైన గాయాలైన డ్రైవర్, క్లీనర్, కృష్ణను 108 వాహనం ద్వారా జొన్నవలస సిహెచ్‌సికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వారిని రిమ్స్‌కు తరలించారు.



బోల్తా పడిన స్కూల్ బస్సు

ప్రమాద విషయాన్ని పాఠశాల యాజమాన్యానికి ఫోన్‌లో చెప్పినా స్పందించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఎండ తీవ్రత కారణంగా ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశించినా, యాజమాన్యం అమలు చేయడం లేదని చెప్తున్నారు. ఉదయం 7.30 గంటలకే పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థులు 8.45 గంటల వరకు పాఠశాలకు చేరకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రోజూ వచ్చే డ్రైవర్ కాకుండా కొత్త డ్రైవర్ రావడంతో, రహదారిపై అవగాహన లేకపోవడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని చెప్తున్నారు. బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

'టాప్' లేపారు

- **ఇఎపి సెట్‌లో సిక్కోలు విద్యార్థుల సత్తా**
- **టాప్-10లో మూడు ర్యాంకులు మనవే**
- **2, 7, 9 ర్యాంకులు కైవసం చేసుకున్న విద్యార్థులు**
- **నీట్‌లోనూ జిల్లా విద్యార్థుల ప్రతిభ**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పొందూరు, పోలాకి, పలాస, ఆమదాలవలస

ఎపి ఇఎపి సెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ అండ్ అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)లో జిల్లాకు చెందిన విద్యార్థులు టాప్ లేపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో టాప్-10 ర్యాంకుల్లో మూడు ర్యాంకులు జిల్లా విద్యార్థులే దక్కించుకోవడం విశేషం. అగ్రికల్చర్, ఫార్మసీ, బిఎస్‌సి నర్సింగ్ విభాగంలో 2, 7, 9 ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. బోర వరుణ్ చక్రవర్తి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించగా, టి.సాయి వెంకట యశ్వంత్ నాయుడు 7వ ర్యాంకు, పొట్నూరు ఆశిష్ 9వ ర్యాంకు సాధించాడు. మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లోనూ బోర వరుణ్ చక్రవర్తి జాతీయస్థాయిలో ఒకటో ర్యాంకు సాధించగా, ఆశిష్ 57వ ర్యాంకు, యశ్వంత్ నాయుడు 709 ర్యాంకును సాధించాడు. పరీక్ష ఏదైనా ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అసమాన ప్రతిభ కనబరిచి సత్తా చాటుతున్నారు. జెఇఇ మెయిన్స్, తెలంగాణ ఎంసెట్, నీట్, ఇఎపి సెట్ ఫలితాలే ఇందుకు నిదర్శనం. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులు, బంధువులు, ఆయా కళాశాలల సిబ్బంది అభినందనలతో ముంచెత్తుతున్నారు.

ర్యాంకుల 'చక్రవర్తి'



అగ్రికల్చర్, ఫార్మసీ, బిఎస్‌సి నర్సింగ్‌లో పోలాకి మండలం తోటాడకు చెందిన బోర వరుణ్ చక్రవర్తి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. మొత్తం 160 మార్కులకు గానూ 151.0651 మార్కులు వచ్చాయి. నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన తెలంగాణ ఎంసెట్‌లోనూ రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విశాఖలోని శ్రీచైతన్య స్కూల్‌లో చదివాడు. ఇంటర్ విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో చదివి 987 మార్కులు సాధించాడు. వరుణ్ చక్రవర్తి తండ్రి రాజేంద్రనాయుడు నరసన్నపేటలో జిల్లాపరిషత్ స్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. తల్లి రాజ్యలక్ష్మి పోలాకి మండలం దీర్ఘాసి ఎంపిపి స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఎంబిబిఎస్ చదివి డాక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని వరుణ్ చక్రవర్తి చెప్పాడు.

సత్తా చాటిన సాయి వెంకట్




పొందూరు మండలం మొదలవలసకు చెందిన తాడ్డి సాయి వెంకట్ యశ్వంత్‌నాయుడు 160 మార్కులకు గానూ 148.9013 మార్కులతో రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన తెలంగాణ ఎంసెట్‌లో 17వ ర్యాంకును సాధించాడు. నీట్‌లో జాతీయస్థాయిలో 709వ ర్యాంకును సాధించాడు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు శ్రీకాకుళంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఆరు నుంచి పదో తరగతి వరకు శ్రీకాకుళం శ్రీచైతన్యలో విద్యనభ్యసించాడు. ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్యలో చదివాడు. తండ్రి శ్రీనివాసరావు మెడికల్ ప్రాక్టీషనర్ కాగా, తల్లి సూర్యకుమారి పొందూరు మండలం కింతలిలో ఎఎన్‌ఎంగా పనిచేస్తున్నారు. వీరు ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలోని పిఎన్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో వైద్య విద్యను అభ్యసించి న్యూరాలజీ విభాగంలో వైద్యునిగా స్థిరపడాలనేది తన లక్ష్యమని చెప్పాడు.

మెరిసిన వేణుగోపాల్



ఆమదాలవలస పట్టణంలోని పూజారిపేటకు చెందిన పైడి వేణుగోపాల్ అగ్రికల్చర్, ఫార్మసీ, బిఎస్‌సి నర్సింగ్‌లో 131.3414 మార్కులతో 135వ ర్యాంకు సాధించాడు. నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గానూ 700 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 215వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 37వ ర్యాంకు సాధించాడు. తెలంగాణ ఎంసెట్‌లో 159వ ర్యాంకు సాధించాడు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విజయవాడలోని శ్రీచైతన్య స్కూల్‌లో, ఇంటర్మీడియట్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో చదివాడు. తల్లిదండ్రులు పైడి నారాయణమూర్తి, ఇందిర ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఎయిమ్స్‌లో వైద్య విద్యను పూర్తి చేసి పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని వేణుగోపాల్ చెప్పాడు.

అదరగొట్టిన ఆశిష్



శ్రీకాకుళం నగరంలోని కొన్నా వీధిలో నివాసముంటున్న పొట్నూరు ఆశిష్ 160 మార్కులకు గానూ 148.2190 మార్కులతో తొమ్మిదో ర్యాంకు సాధించాడు. నీట్‌లో జాతీయస్థాయిలో 57వ ర్యాంకు, ఒబిసి విభాగంలో 12వ ర్యాంకు సాధించాడు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నగరంలోని గాయత్రి స్కూల్‌లో చదివాడు. ఆరు నుంచి పదో తరగతి వరకు నగరంలోని జెవై స్కూల్‌లో, ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్యలో చదివాడు. ఆశిష్ తండ్రి సూర్యం పశు సంవర్ధకశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ కాగా, తల్లి ఆశాలత వెటర్నరీ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఎయిమ్స్‌లో వైద్య విద్యను పూర్తి చేసి సూపర్ స్పెషాలిటీలో కార్డియాలజిస్టు కావాలన్నదే తన లక్ష్యమని ఆశిష్ చెప్పాడు.

ఇంజినీరింగ్‌లో శ్రీకర్‌కు 93వ ర్యాంకు



పలాసకు చెందిన వైశ్యరాజు శ్రీకర్ నిహాల్ ఇంజినీరింగ్ విభాగంలో జనరల్ కేటగిరీలో 93వ ర్యాంకు సాధించాడు. 160 మార్కులకు గానూ 140.69 మార్కులు సాధించాడు. తండ్రి వి.ఎన్.ఎన్ రాజు వ్యాపారి కాగా, తల్లి మాధవి గృహిణి. నిహాల్ జెఇఇ మెయిన్స్‌లో 323వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో ఓపెన్ కేటగిరీలో 40వ ర్యాంకు సాధించాడు. పదో తరగతి విశాఖ శ్రీచైతన్య స్కూల్‌లో, ఇంటర్ విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో చదివాడు.

హామీలు నెరవేర్చకుంటే నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే నిరవధిక సమ్మె చేపడతామని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజేశ్వరి హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టిన అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులు కోరుకున్న విధంగా వారం రోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానన్న సిఎం జగన్ మాట తప్పారని చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గత నెల 22న ప్రారంభించిన దశలవారీ ఆందోళనలు అక్టోబరు 31వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే నవంబరు ఒకటో తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వంలో చలనం రావడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా ఉద్యోగుల నెలవారీ జీత భత్యాలు సకాలంలో చెల్లించక ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌కు బదులుగా ప్రభుత్వం జిపిఎస్‌ను తీసుకురావడం సహేతుకం కాదన్నారు. సిపిఎస్ రద్దు రాష్ట్ర ఖజానాకు ఇబ్బందిగా ఉందని చెప్తున్న ప్రభుత్వ పెద్దలు... ఎమ్మెల్యేలు, ఎంపీల పెన్షన్లు ఇతర సౌకర్యాలకు ఎలా ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. 12వ వేతన సవరణతో పాటు ఉద్యోగుల పిఎఫ్, ఇతర డిఎలు, ఎరియర్స్‌ను చెల్లించాలని, ఉద్యోగుల దాచుకున్న సొమ్ముకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ రోజునే ఆర్థిక ప్రయోజనాలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షులు కిలారి నారాయణరావు, జయమ్మ, మహేష్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఏం కష్టం వచ్చిందో..!

రైలు కింద పడి తల్లీ కుమార్తె మృతి కుమారుని పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఆ తల్లికి ఏం కష్టమొచ్చిందో ఏమో గానీ ఏడాది వయసున్న చిన్నారి, నాలుగేళ్ల కుమారునితో కలిసి రైలు కింద పడింది. ఈ ఘటనలో తల్లీ, కుమార్తె అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన కుమారుడు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ విషాద ఘటన మండలంలోని లొద్దపుట్టిలో బుధవారం చోటుచేసుకుంది. జిఆర్‌పి పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రం కంబిరిగాంకు చెందిన యు.శ్రావణి (25) ఏడాది వయసున్న సిరి, నాలుగేళ్ల కుమారుడు హర్షిత్‌తో కలిసి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన లొద్దపుట్టి రైల్వేగేటు వద్దకు చేరుకుంది. అక్కడ కూర్చొని ఫోన్‌లో చాలాసేపు మాట్లాడుతోంది. కొంతసేపటి తర్వాత బరంపురం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తే రైలు వస్తుండగా పిల్లలను తీసుకుని రైలుకు ఎదురుగా వెళ్లింది. రైలు వారిని ఢీకొట్టడంతో శ్రావణి, సిరి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన హర్షిత్‌ను ఇచ్ఛాపురం కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం బరంపురం ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన హర్షిత్ (ఇన్‌సెట్‌లో మృతి చెందిన సిరి)

ఘటనా స్థలంలో శ్రావణి మృతదేహం రెండు ముక్కలైంది. ఘటనాస్థలికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతుల కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు జిఆర్‌పి ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో రోగుల వివరాలు నమోదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రోగులకు సంబంధించిన వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో, సంబంధిత రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి స్పష్టం చేశారు. రోగుల వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో రోజువారీ నమోదు చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. నగరంలోని అమృత, లైఫ్, సన్‌రైజ్ ఆస్పత్రులను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మలేరియా, డెంగీ, టిబి, టైఫాయిడ్, చికెన్ గున్యా, రేబిస్ తదితర వ్యాధులను నోటిఫైడ్ వ్యాధులుగా గుర్తించిందన్నారు. ఈ వ్యాధులకు సంబంధించిన రోగుల వివరాలను ప్రతిరోజూ రిజిస్టర్, ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ఆదేశించారు. అలా చేయని ఆసుపత్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులు చేరిన నాటి నుంచి వారికి మెరుగైన వైద్యాన్ని అందించి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఇంటికి పంపాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. రోగుల వివరాలకు సంబంధించి ప్రతినెలా తప్పనిసరిగా నివేదికలను అందించాలన్నారు. పర్యటనలో జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, అమృత ఆస్పత్రి వైద్యులు తమ్మినేని వేణుగోపాల్, లైఫ్ ఆస్పత్రి వైద్యులు ఎస్.చంద్రశేఖర్, సన్‌రైజ్ ఆస్పత్రి వైద్యులు డా.బి.సురేష్, డిప్యూటీ డెమో ఎం.వెంకటేశ్వర్లు, సూర్యకళ, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రక్తదానంతో ఆరోగ్యం పదిలమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలోని యువ శిక్షణా కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ప్రారంభించి రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల రెండు నిండు ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయనే అపోహలు, భయాలకు గురికావద్దన్నారు. ఆరోగ్యవంతులు, ఉత్సాహవంతులైన యువత రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డివిజనల్ స్థాయిలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. అందులో భాగంగా శ్రీకాకుళం డివిజన్ పరిధిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16న టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రిలో, 17న పలాస సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన రక్తదాన శిబిరానికి 180 మంది యువత ముందుకువచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. వారి స్ఫూర్తితో తానూ రక్తదానం చేశానన్నారు. రక్తదానంపై జిల్లా యువతలో ఇప్పటికే చైతన్యం వచ్చిందని, ఇదే స్ఫూర్తితో ఆరోగ్యవంతులైన వారందరూ స్వచ్ఛందంగా ముందకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఆరోగ్య సమస్యలు లేని వారందరూ ఆరు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని స్పష్టం చేశారు. ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్న రెడ్‌క్రాస్ సంస్థను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎన్.అనురాధ, అర్బన్ మెడికల్ ఆఫీసర్ జంపు కృష్ణమోహన్, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పోలుమహంతి శ్రీకాంత్, పలు కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

కార్యాలయాల ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం
మండలంలోని గొర్లెపేటలో కృష్ణాపురంలో ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, అంగన్వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. 50 ఇళ్లకు ఒక వాలంటీర్లను నియమించి అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరాము నాయుడు, వెంకటరెడ్డి, రణస్థలం పిఎసిఎస్ చైర్మన్ కిల్లారి రమణ, ఎంపిడిఒ రమణమూర్తి, తహశీల్దార్ సనపల కిరణ్, పంచాయతీ రాజ్ డిఇ సీతంనాయుడు, ఎఇ కూర్మనాథం, అగ్రికల్చర్ ఎఒ విజయ్‌భాస్కరరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పిఒ ఝాన్సీ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనం ప్రారంభించేదెప్పుడో?

ప్రజాశక్తి- మెళియాపుట్టి
మండలంలోని పరశురాంపురం పంచాయతీ నందవలో అంగన్వాడీ భవనాన్ని నిర్మించి ఐదేళ్లు కావస్తుంది. ఇప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంతో భవనం వృథాగా పడింది. రూ.తొమ్మిది లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు ఎంతో అవసరం ఉన్న ఈ భవనాన్ని ఇలా నిరుపయోగంగా ఉండడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ భవనం వినియోగంలోకి వస్తే నందవ, రాయికోలా గిరిజన గ్రామాలకు ఉపయోగపడుతుంది. భవనం ఉన్నా వినియోగంలోకి రాకపోవడంతో వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు సొంత నిధులతో తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి ఈ భవనాన్ని త్వరితగతింగా వినియోగంలోకి తెచ్చి గిరిజన పిల్లల అవస్థలు లేకుండా చూడాలని కోరుతున్నారు.


ప్రారంభానికి నోచుకోని అంగన్వాడీ భవనం

'వి డెంటల్' మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని కృష్ణా పార్కు వద్ద ఉన్న వి ప్రాంజెన్ నిర్వహణలో ఏర్పాటైన వి స్కిన్, హెయిర్ కాస్మోటిక్స్ అండ్ ఎలర్జీస్ ఆస్పత్రిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్రో పాలిటిన్ నగరాల్లో మాత్రమే కన్పించే హెయిర్ ట్రాన్స్ ప్లంటేషన్, టెర్మాలజీ కన్సల్టేషన్ శ్రీకాకుళంలోనూ అందుబాటులో తేవడం ఆనందదాయకమన్నారు. వి స్కిన్, హెయిర్ కాస్మోటిక్స్ అండ్ ఎలర్జీస్ డైరెక్టర్ రామ్మోహన్‌ను అభినందించారు. డాక్టర్లు జాన్‌మాడుగుల మాట్లాడుతూ రెండేళ్లుగా జిల్లా వాసుల ఆదరాభిమానాలతో వి డెంటల్‌ను నిర్వహిస్తున్నామని, వి ప్రాంజెన్ కిందనే స్కిన్, హెయిర్ కాస్మోటిక్స్ అండ్ ఎలర్జీస్‌ను ప్రారంభించామని తెలిపారు. అలాగే ఆస్పత్రి ట్రీట్‌మెంట్ గదిని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రారంభించారు.
అనంతరం మాట్లాడుతూ వి డెంటల్ సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో అందించే వైద్య సేవలే గుర్తుకు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామ్మోహన్, వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్, వైసిపి నాయకులు మామిడి శ్రీకాంత్, సుంకరి కష్ణ, భైరి మురళి, మార్కెటింగ్ మేనేజర్ వెంకటేష్, వైద్యులు, సౌమ్య, ఓంకర్, తరుణ్‌తేజ్, హేమసుందర్, మధు, రేవతి, సౌజన్య, తరంగిణి పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న లక్ష్మీదేవి


మత్స్యకార నాయకులతో అప్పలసూర్యనారాయణ

మత్స్యకార నాయకుల నిర్బంధం తగదు

శ్రీకాకుళం అర్బన్ : మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజెప్పాలనే లక్ష్యంతో మత్స్యకార సాధికారత కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్న టిడిపి నాయకులను అక్రమ పద్ధతిలో నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి మత్స్యకార నాయకులను విడుదల చేయాలని కోరుతూ స్టేషన్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం స్టేషన్ ఉన్న ఉన్నతాధికారులతో చర్చించి మత్స్యకార నాయకులను విడుదల చేశారు. కార్యక్రమంలో మత్స్యకార సాధికార కమిటీ జిల్లా కన్వీనర్ మైలపల్లి నర్సింగరావు, రాష్ట్ర డైరెక్టర్ మైలపల్లి త్రినాథరావు, యువ నాయకులు బుక్కా యుగంధర్, దుమ్ము అశోక్, చీకటి శ్రీరాములు, మైలపల్లి సింహాచలం, మైలపల్లి రాంబాబు, సూరడ చంద్రమౌళి, ఎర్రయ్య, చింతపల్లి సూర్యనారాయణ, కోడ తాతారావు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఈ ఏడాది విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశానికి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశామని, ఇంటర్ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. బిఎ, బి.కాం, బిఎస్‌సిలో ప్రవేశం నిమిత్తం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో ఈ నెల 19 నుంచి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. డిగ్రీ ప్రవేశానికి సంబంధించి అన్ని ధ్రువీకరణ పత్రాలు తీసుకుని కళాశాలలో నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ నెల 24 వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో పోర్టల్ పనిచేస్తుందని తెలిపారు.

డిఎస్‌సి-98 టీచర్లకు రెన్యువల్

ఇచ్ఛాపురం : డిఎస్‌సి–98 కాంట్రాక్టు టీచర్లకు రెన్యువల్ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. 98 డిఎస్‌సి ఎంటిఎస్ కాంట్రాక్టు టీచర్లకు రెన్యువల్ చేస్తూ విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిఒను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు ప్రకారం డిఎస్‌సి 98 మినిమం టైం స్కేల్‌లో కాంట్రాక్టు టీచర్లుగా నియమిస్తూ... వారి సర్వీసులను పునరుద్ధరించారని అన్నారు. ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ నెల వరకు కొనసాగుతారని అన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్
స్థానిక వైసిపి కార్యాలయంలో నియోజకవర్గంలో రూ.6,88,000 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం పంపిణీ చేశారు. మండలంలో శాసనం గ్రామానికి చెందిన రాపాక కృష్ణారావుకు రూ.లక్ష, టెక్కలికి చెందిన జొన్న కాశీ విశ్వనాథంకు రూ.40 వేలు, చాకిపల్లికి చెందిన బొంగు పావనికి రూ.28 వేలు, కోటబొమ్మాళి మండలంలో జి.ఎన్.పేటకు చెందిన నంబళ్ల నందకుమార్‌కు రూ.1.40 లక్షలు, అన్నుపురానికి చెందిన బి.దామోదరరావుకు రూ.1.50 వేలు. చెరుకుపల్లికి చెందిన రత్నాల సత్యవతికి రూ.60 వేలు, కిష్టుపురానికి చెందిన కొత్తపల్లి ముఖలింగం కు రూ.లక్ష, గురువెల్లిపల్లికి చెందిన నూక సింహాచలంకు రూ.70 వేలు సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యాయి. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్


అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

'అన్న క్యాంటీన్' ప్రారంభం

కోటబొమ్మాళి: నిరుపేదలకు అకలి తీర్చేందుకు రూ.5లకే కడుపు నిండా భోజనం అన్న క్యాంటీన్ ద్వారా లభిస్తుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్‌లు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం అవరణలో బుధవారం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని హోటల్‌లో భోజనం ఎంతో ఖరీదని అన్నారు. సాధారణ భోజనం ఒక్కరికి రూ.80 నుంచి రూ.120లు ఉందన్నారు. అంత ఖర్చు చేసి భోజనం చేసే పరిస్థితి పేదలకు ఉండదని అన్నాడు. రోజువారి కూలి పని చేసుకుని జీవించే వారికి అసలు ఉండదని, అటువంటి వారికి ఈ అన్న క్యాంటీన్ అకలిని తీర్చుతుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, టెక్కలి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, వెలమల విజయలక్ష్మి పాల్గొన్నారు.

వంద స్టీల్ ప్లేట్లు వితరణ

అన్న క్యాంటీన్‌కు టిడిపి మహిళా అధ్యక్షులు, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైలజ, భర్త సత్యన్నారాయణ రూ.7 వేలు విలువ కలిగిన వంద స్టీల్ ప్లేట్లను వితరణ అందజేశారు. ఈ ప్లేట్లను మండల టిడిపి నాయకులు అన్న క్యాంటీన్ నిర్వాకులకు అందజేశారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

వైసిపిలో వంద కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- పోలాకి
మండలంలోని బొద్దం పంచాయతీ వనవిష్ణుపురంలో మాజీ సర్పంచ్ పాలిన కృష్ణమూర్తి ఆధ్వర్యాన 79 కుటుంబాలు వైసిపిలో చేరారు. గ్రామంలో అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ వైసిపి కండువా వేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. అలాగే కుసుమపోలవలసలో కూడా 21 టిడిపి సానుభూతిపరులకు చెందిన కుటుంబాలు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ భైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణమూర్తి, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధన 'జ్ఞానజ్యోతి'కే సొంతం

ప్రజాశక్తి- నరసన్నపేట
నరసన్నపేట కేంద్రంలో సుదీర్ఘకాలంగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నడిపిస్తున్న ఏకైక విద్యా సంస్థ జ్ఞానజ్యోతి స్కూల్, కళాశాల అని, అలాగే అత్యుత్తమ ఫలితాల సాధనలో జ్ఞానజ్యోతికే సొంతం అని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కళాశాలలో ఇంటర్మీడియట్ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, తమ హైస్కూల్ నుంచి ఎపిఆర్‌జెసిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా యాజమాన్యంలో ఒకరైన వెంకట రమణ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎంపిసిలో వి.సాయిచరన్ 464/470, కె.కుసుమ 464/470 మార్కులు సాధించారని అన్నారు. అలాగే ద్వితీయ ఇంటర్మీడియట్‌లో టి.లిఖిత, జి.మౌనిక, వై.సోమేశ్వరరావులు 988/1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే ఎస్.రాము 987/1000, సిహెచ్.నిఖిత, వై.ఉష 983/1000 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఎపిఆర్‌జెసి ఫలితాల్లో వై.శివసాయికి 18, వి.మణికంఠకి 26, ఎస్.సీతారాంకి 42, బి.సాయికి 88, సిహెచ్.రంజిత్‌కి 92 ఇలా అనేక మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. గత 27 ఏళ్ల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే విద్యాబోధన చేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామని అన్నారు. మా విద్యా సంస్థలో చదువుకున్న విద్యార్థులు విదేశాల్లో రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటూ స్థిరపడ్డారని, ఇది మాకు ఎంతో గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం రంగారావు, నిరంజన్, రుక్మన్మధరావు, కృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం


కింద పడిన రేకుల షెడ్డు పైకప్పు

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- జి.సిగడాం
మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలు ఒక్కసారిగా ఎక్కువగా రావడంతో మధుపాంకు చెందిన జాక ఆదినారాయణ రేకుల షెడ్డు పైకప్పు ఒక్కసారిగా వంద మీటర్ల దూరంలో ఎగిరిపడింది. ఆ షెడ్డులో ఉన్న వారంతా కూడా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గాలి వాన ఒక్కసారిగా రావడంతో రోడ్లపై జనాలు ఎవరూ లేకపోవడం వల్ల ప్రమాదం తప్పింది. అనంతరం గ్రామస్తుల సహకారంతో రేకును షెడ్డు దగ్గరికి తీసుకొని వచ్చారు. అలాగే మండలంలో సిగడాం, పాలఖండ్యం, నదిమివలస, బాతువ, ఎందువ తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో పాటు అక్కడక్కడ వర్షం కురిసింది.

బైజూస్‌కు 'కాకినాడ ఆదిత్య' విద్యార్థుల ఎంపిక


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివశంకర్

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని అరసవిల్లి కూడలి వద్ద ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు బొడిగి చంద్రిక, జామి యశ్విత, కింతలి సింధులు బైజూస్‌లో ఉద్యోగాలకు ఎంపిక య్యారు. వారికి రూ.7.5 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. ఈ సందర్భం గా విద్యార్థినులను అభినందిస్తూ తమ కళాశాల విద్యార్థులు బైజూస్‌కు ఎంపిక కావడంపై ఆనం దం వ్యక్తం చేశారు. తల్లితండ్రుల కలలను నిజం చేయడంలో కాకినాడ ఆదిత్య ముందు ఉంటుంద న్నారు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ వల్లే ఇది సాధ్యమైందన్నారు. సాంకేతిక టెక్నాలజీలను అందిపుచ్చుకొని విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామ న్నారు, డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న ప్రతి విద్యార్థీ మూడు, అంతకంటే ఎక్కువ క్యాంపస్ కొలువులు సాధించారన్నారు. బైజూస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ రైతు భరోసా

సోంపేట : నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న అర్హులైన రైతులందరికీ రైతు భరోసా డబ్బులు అందుతుందని వ్యవసాయశాఖ ఎడిఎ జగన్మోహనరావు అన్నారు. సోంపేటలో నాలుగు మండల వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 1న నాలుగు మండలాల్లో 819 మంది రైతులకు రూ.5,500 చొప్పున రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని అన్నారు. పిఎం కిసాన్ లబ్ధిదారులు 4891 మంది ఇంకా ఇకెవైసి చేయించుకోలేదని, తక్షణమే వారు ఇకెవైసి చేయించుకోవాలని అన్నారు. నాలుగు మండలాల్లో 1002 మంది రైతులు బ్యాంకు ఖాతాలకు ఆధార అనుసంధానం చేయలేదని, దాంతో డబ్బులు జమ కావని అన్నారు. రైతులు ఈ–బ్యాంకు అనుసంధానం తక్షణమే చేయించుకోవాలని సూచించారు. అలాగే రైతుల నుంచి మట్టి నమూనాల సేకరణ, వైఎస్ఆర్ యంత్ర సేవా పథకాలకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు శ్రీదేవి, నరసింహమూర్తి, ధనం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎడిఎ జగన్మోహనరావు


వారాహి యాత్ర బ్యానర్ వద్ద పూజలు చేస్తున్న నాయకులు

'వారాహి'ని విజయవంతం చేయాలి

పొందూరు: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నవరంలోని సత్యదేవుని సన్నిధిలో ప్రారంభిస్తున్న వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన మండల నాయకులు కొంచాడ చిన్నంనాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక వెంకటేశ్వర స్వామి సన్నిధానంలో బుధవారం పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల తెలుసుకోవాలనే ధ్యేయంతో ప్రజల ముందుకు వారాహి యాత్ర ద్వారా వస్తున్నారని, ఆయనకు అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ముల్లు హరనాథ్, జామాన అప్పలనాయుడు, గార బాబూరావు, బెల్లాన శివప్రసాద్, కొంచాడ శిమ్మినాయుడు, కొంచాడ రాంబాబు పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
స్థానిక జ్ఞానభారతి విద్యా సంస్థలో సీడ్ ఎపి ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. ఉదయం నుంచి ఇంటర్వ్యూకు భారీగా నిరుద్యోగులు తరలి వచ్చారు. ఈ జాబ్‌మేళాలో 276 అభ్యర్థులు హాజరు కాగా, 106 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సీడ్ ఎపి చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందులో అరబిందో ఫార్మాకు 9 మంది, సుజకి ఏరినాకు ఐదుగురు, డిక్సన్‌కు 28, అపోలో ఫార్మసీకి ఆరుగురు, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఒకరు, టిసిఎల్‌కు 14, జెమ్స్ ఆస్పత్రికి ముగ్గురు, సన్ ఫైనాన్సియల్ ఏజెన్సీస్ ఏడుగురు, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టుకు 15, భారత్ ఎఫ్ఐహెచ్‌కు ఐదుగురు, యూత్ ఫర్ జాబ్స్‌కు ఒకరు, మేడి ప్లస్‌కు ఒకరు, ఎఆర్‌డిఇకి 11 మంది ఎంపికయ్యారని అన్నారు. కార్యక్రమంలో రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, డిఆర్‌డిఎ అధికారులు పాల్గొన్నారు.


అభినందిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

రక్త సేకరణలో 'ఎంజిఆర్' చొరవ

ప్రజాశక్తి- శ్రీకాకుళం
ఎంజిఆర్ మొబైల్ బ్లడ్ బ్యాంకు ద్వారా ఎనిమిదేళ్లుగా 12,683 యూనిట్లు రక్తాన్ని సేకరించామని పాతపట్నం నియోజకవర్గ టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు తెలిపారు. బుధవారం ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్తదాతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతోమంది రోగులకు వైద్యంతో పాటు కొత్త రక్తం అందించడం ఎంతో అవసరమని అన్నారు. సకాలంలో రక్తం అందక ఎందరో రోగులు మృతి చెందుతున్నట్లు తెలుసుకున్నానని అన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని ఎంజిఆర్ మొబైల్ బ్లడ్ బ్యాంకు ప్రారంభించి రక్తాన్ని సేకరిస్తున్నామని అన్నారు. ఈ రక్తాన్ని వివిధ ఆస్పత్రులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని అన్నారు.


రక్తదానం చేస్తున్న 'ఎంజిఆర్' సభ్యుడు (ఫైల్)

త్వరలో ఆర్‌బికె ప్రారంభం

టెక్కలి : మండలంలోని నర్సింగపల్లికి చెందిన రైతు భరోసా కేంద్రం ప్రారంభం త్వరలో చేపట్టనున్నామని నర్సింగపల్లి సర్పంచ్ రౌతు జయమోహన్ బుధవారం తెలిపారు. 'ఈ నెల 14న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'నిర్మించారు... వదిలేశారు' అనే కథనానికి ఆయన స్పందించారు. ఆర్‌బికె ప్రారంభించి రైతాంగానికి అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు.


నర్సింగపల్లి ఆర్‌బికె కేంద్రం

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

సోంపేట : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రజల్లోకి కార్యకర్తలు విస్తృతంగా తీసుకెళ్లాలని మజ్జి తులసీదాస్ మెమోరియల్ ట్రస్టు చైర్మన్, వైసిపి నాయకుడు మజ్జి త్రినాథ్‌బాబు అన్నారు. సోంపేటలోని వైసిపి కార్యాలయంలో నాయకులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.చలపతిరావు, పి.పట్టాభి, రామారావు, యు.బ్రహ్మానందం, బి.ఢిల్లీరావు, ఎస్.షణ్ముఖరావు, భరత్‌దొలాయి పాల్గొన్నారు.

అందుబాటులో 'గేమ్ ఛేంజర్' హీరో ప్యాషన్ ప్లస్


నమూనా కీని అందజేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
సరికొత్త ఫీచర్స్‌తో గేమ్ ఛేంజర్‌గా ప్యాషన్ ప్లస్ బైక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టిందని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎన్.లక్ష్మణరావు అన్నారు. ద్విచక్ర వాహన రంగంలో నంబర్ వన్ సంస్థ అయిన హీరో మోటోకార్ప్ సరికొత్త ఫీచర్స్‌తో ప్యాషన్ ప్లస్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. నగరంలోని వరం ఆటో సెంటర్‌లో ప్యాషన్ ప్లస్ పరిచయ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వరం ఆటో సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ అంధవరపు ప్రసాదరావుతో కలిసి ఎస్ఐ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హీరో మోటో కార్ప్ సంస్థ 2001లో 'ప్యాషన్'ను ఇండియాలోకి తీసుకొచ్చిందని తెలిపారు. అనంతరం ప్రథమ వాహన కొనుగోలుదారునికి వాహన తాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంధవరపు శంశరరావు, హీరో నెట్‌వర్క్ సేల్స్ మేనేజర్ మణికంఠ, వరం ఆటో సెంటర్ సేల్స్ మేనేజర్ మొదలవలస శ్రీనివాసరావు, అకౌంట్స్ మేనేజర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'నీట్'లో విద్యార్థుల ప్రతిభ


జాహ్నవి పొందూరు
దేవిశ్రీప్రసాద్ పొందూరు
అనిష్‌కుమార్ టెక్కలి
రవితేజ కోటబొమ్మాళి
కాత్యాయని జలుమూరు
హర్షవర్ధన్ ఆమదాలవలస
రోహిత్ మెళియాపుట్టి
పూజిత మెళియాపుట్టి

పొందూరు: కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన జాతీయస్థాయి నీట్ పరీక్షలో పొందూరు మండలం చెందిన పలువురు విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి ఉత్తమ ర్యాంకులను సాధించారు. మండల కేంద్రానికి చెందిన కూటి కుప్పల జాహ్నవి నీట్ పరీక్షలో జాతీయస్థాయిలో 651 మార్కులు సాధించి 6,556 ర్యాంకు సాధించింది. కేటగిరి విభాగంలో 2,325 ర్యాంకును సాధించింది. ఈమె ప్రాథమిక విద్య స్థానిక మోడరన్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ విజయవాడ శ్రీచైతన్యలో చదివింది. తల్లిదండ్రులు బోజరాజు, విశాలాక్షి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. అలాగే మండలంలోని బాణాంకు చెందిన పెద్దింటి దేవిశ్రీప్రసాద్ ఆలిండియా స్థాయిలో 641 మార్కులు సాధించి 9,603 ర్యాంకును, 3665 కేటగిరీ ర్యాంకును సాధించాడు. తండ్రి పెద్దింటి రవిబాబు బాణాం మాజీ సర్పంచ్‌గా పనిచేశారు.

టెక్కలి రూరల్ : టెక్కలి గందరగోళం వీధి చెందిన సారవకోట లక్ష్మణరావు, మమత దంపతుల ఏకైక కుమారుడైన అనిష్ కుమార్ మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో 720 కి 700 మార్కులు సాధించి ఆల్ ఇండియలో 216 వ ర్యాంకు సాధించాడు. ఎబిసి కేటగిరీలో 38వ ర్యాంకు సాధించాడు. తండ్రి విశాఖలోని ఓ ప్రయివేటు ఉద్యోగి. తల్లి భగవాన్‌పురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఇటీవల రణస్థలం బదిలీ అయ్యారు.

పలాస: మండలంలోని ఉదయ్‌పురానికి చెందిన డొక్కరి శ్రీను, త్రివేణి దంపతుల కుమార్తె వాగ్దేవి నీట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. నీట్ ఫలితాల్లో 581 మార్కులు సాధించి ఆలిండియాలో 18 వేలు ర్యాంకు సాధించింది. నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాగ్దేవికి యాదవ పెద్దలు లొడగల కామేశ్వరరావు, అంబటి కృష్ణమూర్తి, డొక్కరి శంకర్, సప్ప నవీన్, వంకల కూర్మారావు, కిక్కర ఢిల్లీరావులు అభినందించారు.

కోటబొమ్మాళి: నీట్ ఫలితాల్లో స్థానిక విద్యుత్ నగర్‌కు చెందిన అన్నెపు రవితేజ అలిండియా స్థాయిలో 388వ ర్యాంకు, ఒబిసి స్థాయిలో 79వ ర్యాంకు సాధించి ప్రతిభను కనబరించారు. రవితేజ తల్లి అనుసూయ గృహిణి, తండ్రి అన్నెపు ఢిల్లేశ్వరావు కోటబొమ్మాళి సమీపంలోని జ్యూట్ పరిశ్రమంలో పనిచేస్తున్నాడు. వీరు కొంతకాలంగా సరుబుజ్జిలి నుంచి వృత్తిరీత్యా కోటబొమ్మాళికి వచ్చి స్థానిక విద్యుత్ నగర్‌లో నివాసముంటున్నారు. రవితేజను 7 వరకు స్థానిక బ్రాడ్లా స్కూల్‌లో, పదో తరగతి వరకు నరసన్నపేట నారాయణ పాఠశాలలో, ఇంటర్ విశాఖపట్నం నారాయణ కళాశాలలోను చదివించారు.

జలుమూరు: మండలంలోని చిన్నదూగాంకు చెందిన పీస కాత్యాయని నీట్ ఫలితాల్లో సత్తా చాటి 612 మార్కులు సాధించింది. ఆల్ ఇండియా ర్యాంకు 22,005 కాగా, కేటగిరి రాంకు 9,366 సాధించింది. ఈమె ప్రాథమిక విద్య నరసన్నపేటలోని ఓ ప్రయివేటు పాఠశాలలో, ఇంటర్మీడియట్ విజయవాడలోని ఓ ప్రయివేట్ కళాశాలలో చదువుకుంది. కాత్యాయని తల్లి పద్మావతి ప్రస్తుతం చిన్నదూగాం సర్పంచ్. తండ్రి శ్రీనివాసరావు మాజీ సర్పంచ్. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రోత్సాహంతో చదువుకున్నట్లు చెప్పారు.

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని 22 వార్డు లక్షుడుపేటకు చెందిన ఎం.వి.వి.హర్షవర్ధన్ ఇంజినీరింగ్ విభాగంలో 29వ ర్యాంకు సాధించాడు. 8 నుంచి ఇంటర్ వరకు విశాఖపట్నంలోని నారాయణ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించాడు. ఈయన తల్లిదండ్రులు మెండ శ్యామలరావు, విమలకుమారి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు వార్డులోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెళియాపుట్టి : నీట్ ఫలితాల్లో కరజాడకు చెందిన నెమలిపురి రోహిత్ 720 మార్కులకు గాను, 676 మార్కులు సాధించి ఆల్ ఇండియాలో 1914 ర్యాంకును సాధించారు. తండ్రి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. అలాగే మెళియాపుట్టికి చెందిన బైపోతు పూజిత 720 మార్కులకు గాను 600 మార్కులు సాధించి 29 వేల ఇరవై తొమ్మిది ర్యాంకును సాధించింది. ఈమె విశాఖ టెక్నో చైతన్య 8 నుంచి ఇంటర్ వరకు చదివారు. ఈమె తల్లిదండ్రులు కూరగాయల వ్యాపారం చేస్తున్నారు.


పలాస : అభినందిస్తున్న యాదవులు



నియామక పత్రాలను అందజేస్తున్న మంత్రి ధర్మాన

అంగన్వాడీలకు నియామకపు పత్రాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గార ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఇటీవల భర్తీ చేసిన పలువురు అంగన్వాడీ కార్యకర్తలకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం నియామక పత్రాలను అందజేశారు. శ్రీకాకుళం రూరల్ పెద్దపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా మాతా, శిశు సంరక్షణకు సమర్థతతో పనిచేయాలన్నారు. నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ, సామాన్యులకు సేవలందించాలని పౌష్టికాహార పంపిణీని సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో గార ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ రాధామాధవి, వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ గొండు కృష్ణ, గురుగుబిల్లి లోకనాథం, బరాటం శ్రీధర్ పాల్గొన్నారు.

కాలువలు ఆక్రమిస్తే చర్యలు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగేంద్రకుమార్

పలాస : కాలువపై అక్రమ నిర్మాణాలు చేపడితే కఠినంగా చర్యలు తీసుకుంటామని పలాస మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ వ్యాపారులకు హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కేటి రోడ్డు విస్తరణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువపై నిర్మాణాలను గుర్తించి అటువంటి వారికి నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కాలువ పనుల్లో భాగంగా కాలువలు ఎక్కడెక్కడ లింకులు కలపకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే లింకులు కలిపే విధంగా పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈయనతో పాటు మున్సిపల్ టిపిఒ సీతారాం, మున్సిపల్ డిఇఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

సిపిఎస్ రద్దుపై మాట నిలబెట్టుకున్న జగన్

ఆమదాలవలస : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి ఉద్యోగులకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వస్తున్నారని, ఇప్పటివరకు 99 శాతం మేనిఫెస్టోలోని హామీలను అమలు చేశారని గుర్తు చేశారు. 10,600 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి వారి కుటుంబాలకు భరోసా కల్పించారన్నారు. కొత్త పెన్షన్ విధానంలో ఉద్యోగి తన ఆఖరు నెల జీతంలో సగం మొత్తం పెన్షన్‌గా నిర్ణయించి కరువు బత్యాన్నీ అదనంగా చెల్లిస్తారని, ఇది పాత పెన్షన్ విధానానికి దాదాపు సమానమని అన్నారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో అన్నెపు కృష్ణ, శ్రీనివాసరావు, రామ్మోహన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఛైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

విధి నిర్వహణలో అలసత్వం వద్దని మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు మెప్మా సిబ్బందికి సూచించారు. పలాస మెప్మా కార్యాలయంలో మెప్మా ఆర్‌పిలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు మహిళలకు అందేలా చూడాలన్నారు. మహిళా గ్రూపులకు రుణాలు మంజూరు చేయడంతో పాటు తిరిగి బ్యాంకులకు సకాలంలో డబ్బులు చెల్లించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా అధికారి రాము, మెప్మా టిఎంసి భాస్కరరావు, స్వప్న పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందేలా చూడాలని, త్వరగా పథకాలు అందించేందుకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సచివాలయం అడ్మిన్లకు బుధవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో నిజమైన, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి బోనెల రాము, డబ్బీర్ నాగు, సచివాలయం అడ్మిన్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు బీమాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం అమలు చేస్తున్న పశువుల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ వి.జయరాజు అన్నారు. మండలంలోని కిష్టుపురం పంచాయతీ బలరాంపురంలో పాడి రైతులకు మండల పశు వైద్యాధికారులు నిర్వహించిన పశువుల బీమాపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు కలిగిన పాడి రైతులు రెండేళ్ల నుంచి పదేళ్ల వయసు లోపల ఉన్న ఆవులకు, గేదెలకు రూ.200 ఇన్స్యూరెన్స్ చెల్లిస్తే... ప్రమాద బీమా రూ.15 వేలు అందుతుందని అన్నారు. అలాగే ఒక సంకరజాతి, స్వదేశీజాతి పశువులకు రూ.400 ప్రీమియం చెల్లిస్తే... ప్రమాద బీమా రూ.30 వేలు అందుతుందని అన్నారు. అలాగే చిన్న జీవాలు గొర్రెలు, మేకలు రూ.6 వేలు బీమాకు రూ.90లు చెల్లిస్తే... కాల పరిమితి మూడేళ్ల వరకూ వర్తిస్తుందని అన్నారు. అనంతరం 44 పశువులకు పాడి రైతులు బీమా చేయించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.లోకనాథం, కురుడు, తిలారు వైద్యాధికారులు ఎల్.కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞచైతన్య, సర్పంచ్ బొడ్డు వెంకటరమణ, మండల పశుసంవర్ధక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి- జలుమూరు

ప్రతి ఉద్యోగికీ తాను పనిచేసిన చోట చేసిన సేవలతోనే తగిన గుర్తింపు లభిస్తుందని జలుమూరు పిహెచ్‌సి వైద్యాధికారి టి.శ్రీకాంత్ అన్నారు. జలుమూరు పిహెచ్‌సిలో ఎఎన్‌ఎంలుగా పనిచేసి హెల్త్ విజిటర్లుగా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్లిన జి.అమలాంబ, ఎస్.సరోజినిలను బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే వైద్య శాఖలో ఉద్యోగాలు చేయడం ఆనందదాయకమన్నారు. అటువంటి వైద్య శాఖలో ఉద్యోగం చేస్తూ గ్రామస్తుల మన్ననలు పొందినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.వంశీకృష్ణ, సిహెచ్ఒ ఎస్.పద్మావతి, హెచ్ఎస్ చిన్నరాజులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఎంజిఆర్' ఆర్థికసాయం

మెళియాపుట్టి : మండలంలోని చాపర పెద్దదేవంగుల వీధిలో రామాలయం పునర్నిర్మాణానికి నియోజకవర్గం టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు రూ.50 వేలు నగదును బుధవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా ఆపదలో ఉంటే తనను సంప్రదించాలని, తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వెంకటేష్, శారద, తిరుమల, సింహాచలం, భద్రం, భాస్కరరావు, త్రినాథులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

జగనన్న కిట్లు పంపిణీ



ఆమదాలవలస : కిట్లను అందజేస్తున్న సర్పంచ్ వాణిశ్రీ

ఆమదాలవలస : రాష్ట్రంలో విద్యారంగంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ అన్నారు. మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పలు రకాల పథకాలను ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. పేద విద్యార్థులు రుణభారం లేకుండా విద్యను అభ్యసిస్తూ ఉన్నత విద్యావంతులుగా తయారవుతున్నారని అన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, సర్పంచ్ ప్రతినిధి చిగురుపల్లి దశరథ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని ఓ.వి.పేట మోడల్ స్కూల్‌లో వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు, బగాది నారాయణమూర్తి, ఎ.రమణమూర్తి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



జీతాన్ని అందజేస్తున్న హెచ్ఎం లావణ్య

వజ్రపుకొత్తూరు: పాఠశాల అభివృద్ధిలో విద్యావంతులు భాగస్వామి కావాలని పాఠశాల తల్లితండ్రుల యాజమాన్య కమిటీ ఛైర్మన్ పల్లెటి మోహనరావు కోరారు. మండలంలోని డోకులుపాడు ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న విద్యా వాలంటీర్ రేష్మకు సైనిక సేవాదళ్ రూ.పది వేలు జీతాన్ని బుధవారం ప్రధానోపాధ్యాయురాలు లావణ్య చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి స్థానికులు సంఘాల ప్రతినిధులు సహకరిస్తున్నారని ఛైర్మన్ అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌కు మరింత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవి, తేజశ్వరి, దిల్లేశ్వరరావు, పిఎంసి కమిటీ సభ్యులు, యుగంధర్ రంజిత్, షణ్ముఖరాజు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రకుమారి

మెళియాపుట్టి : ఉపాధి హామీని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ పి.చంద్రకుమారి అన్నారు. మండలంలోని మెళియాపుట్టి, వసుంధర గ్రామాల్లో చేపడుతున్న చెరువు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడంతో పాటు స్థానికంగానే వారికి ఉపాధి చూపించడం ద్వారా వారికి వలసలు నివారించాలన్నదే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. చల్లని సమయాల్లో రెండు పూటలు పనిచేసి కనీస కూలీ పొందాలని అన్నారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇసి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన ఆదిరెడ్డి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదిరెడ్డి

ఇచ్ఛాపురం : తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని వైసిపి ప్రచార కమిటీ జిల్లా ఛైర్మన్ తాడి ఆదిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైసిపి బలోపేతానికి కృషి చేయాలని విజయసాయిరెడ్డి ఆదిరెడ్డిని కోరారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతం చేయాలన్నారు.

రేపు రక్తదాన శిబిరం

టెక్కలి : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఈ నెల 16న స్థానిక జిల్లా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, యువకులు పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.



సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

గోవిందరావుకు సన్మానం

బూర్జ : టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావును మండలంలో 16 సచివాలయం, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆయన నివాసంలో బుధవారం మర్యాపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా గోవిందరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి నాకు ఈ పదవిని అప్పగించారని అన్నారు. మన ప్రాంత ప్రజలతో పాటు రాష్ట్రంలో ఏ సమస్య అయినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ రామకృష్ణ, కిరణ్‌కుమార్, అరుణ, అన్వర్, రాజారావు, ప్రసాద్ పాల్గొన్నారు.